ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 22 అక్టోబరు 2024



జడ్పీలో జగడమేనా?

» మళ్లీ అత్యవసర సమావేశానికి పట్టుపట్టిన వైసీపీ » ఏలూరులో సమావేశమైన 30 మంది జడ్పీటీసీలు » నెలలో ఇది రెండోసారి డిమాండ్ » అత్యవసరమా.. అదిలింపా » వెనకుండి నడిపిస్తున్న నేతలెవరు? » చైర్‌పర్సన్ పద్మశ్రీ అనుకూలురుల్లో మాత్రం ధీమా 7

దిగిరాని బాణసంచా ధరలు 6

అమరవీరుల త్యాగాలు,
ఆశయాలు స్ఫూర్తి: ఎస్పీ

ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

భీమవరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల త్యాగాలు, ఆశయాలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమవరం పట్టణంలోని మార్కెట్‌యార్డు గ్రౌండ్‌లో విధి నిర్వహణలో అమరులైన సిబ్బందిని స్మరించుకుంటూ స్మృతి పోలీస్ పరేడ్ నిర్వహించారు. ముందుగా సమాజ భద్రత, రక్షణల కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల ఆశయాలను స్మరించుకుంటూ పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా కలెక్టర్ నాగరాణి, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, జిల్లా ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ ఎం సత్యనారాయణ, ఇతర అధికారులు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎస్ఐ ఎ.నాగేశ్వరరావు, ఏఎస్ఐ డి.పీటర్, హెచ్‌సీ డీసీహెచ్‌వీ జి.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులకు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి... కలెక్టర్ నాగరాణి

భూముల ధరలకు రెక్కలు



» రిజిస్ట్రేషన్ విలువ పెంచే యోచనలో ప్రభుత్వం
» క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భూముల రిజిస్ట్రేషన్ విలువను పెంచేందుకు మళ్లీ అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. జాతీయ రహదారులు, వాణిజ్య పరమైన ప్రాంతాల్లో పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతిఏటా, గ్రామీణ పరిధిలో రెండేళ్లకు ఒకసారి భూముల విలువను పెంచాలి. వైసీపీ హయాంలో భూములు ధరలు పెరగలేదు. బహిరంగ మార్కెట్‌లోనూ అమ్ముడు పోలేదు. పైగా ధరలు పతనమయ్యాయి. అయినా సరే ఏదో వంకతో రిజిస్ట్రేషన్ విలువను అప్పట్లో పెంచారు. భవనాలపై ధరలు పెంచేశారు. అలాగే భీమవరం వంటి జిల్లా కేంద్రంలోనూ 20శాతం పెంపుదల చేశారు. అయినా సరే రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం పెరగలేదు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆపసోపాలు పడ్డారు. జిల్లాలో గత ఏడాది 70శాతం ఆదాయం కూడా సాధించలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల్లోనూ ఆశలు చిగురించాయి. రిజిస్ట్రేషన్ ఆదాయం పెరుగుతుందంటూ అంచనాలు వేసుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగా భూముల రిజిస్ట్రేషన్ విలువను పెంచాలని యోచిస్తున్నారు. అయితే అంతిమంగా ప్రభుత్వం అనుమతితోనే పెంచాల్సి ఉంటుంది. అంతలోగా క్షేత్ర స్థాయిలో సమీక్షలు నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

హైవేల వైపు డిమాండ్

జాతీయ, రాష్ట్ర హైవేలకు ఆనుకుని ఉన్న భూములకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు అధికంగా చెపుతున్నారు. అమ్మకాలు జరగకపోయినా సరే కొనుగోలు చేద్దామంటే ధర అధికంగా ఉంటోంది. ప్రధాన రహదారులకు ఆనుకుని ఇరువైపుగా భూములకు డిమాండ్ ఉంటుందని రిజిస్ట్రేషన్ శాఖ ఒక అంచనాకు వచ్చింది. అక్కడే ధరలు పెంచేలా నిర్ణయం తీసుకోనుంది. కనిష్ఠంగా 10శాతం పెంచాలని భావిస్తున్నారు. తాడేపల్లిగూడెం,- తణుకు మీదుగా వెళ్లే 216 జాతీయ రహదారి, నర్సాపురం-మచిలీ పట్నం వెళ్లే జాతీయ రహదారిపై దృష్టి సారించారు. అలాగే రాష్ట్ర హైవేలకు అనుకుని ఉన్న భూములపైనా ఆరా తీస్తున్నారు. ఆకివీడు నుంచి దిగమర్రు వరకు ఉండి, భీమవరం, పాలకొల్లు నియోజకవర్గాలు మీదుగా నిర్మాణం కానున్న జాతీయ రహదారికి ఆనుకుని భూముల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే ధరలు పెరిగి రిజిస్ట్రేషన్ కాని చోట మాత్రం పెంచేందుకు రిజిస్ట్రేషన్ అధికారులు విముఖతతో ఉన్నారు. రిజిస్ట్రేషన్‌లు కాని చోట పెంచడం వల్ల ఫలితం ఉండదని తలపోస్తున్నారు. డిమాండ్ ఉన్న ప్రాంతాలకే పెంపు పరిమితమయ్యేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

వాణిజ్య సముదాయాలపై దృష్టి

పట్టణ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న పల్లెలు, పట్టణాల్లోనూ వాణిజ్య సముదాయాల వద్ద విలువను పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ స్థాయిలోనూ పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతో ఉంది. దీనివల్ల వాణిజ్య ప్రాంతాల్లో డిమాండ్ ఏర్పడనుంది. మరోవైపు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లోనూ మార్పులు తీసుకువస్తున్నారు. ప్రైవేటు మద్యాన్ని ప్రోత్సహించారు. అదే విధంగా ఆక్వా రంగానికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే పల్లెల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. పట్టణాల్లోనూ మున్సిపల్ నిధులకు వెసులుబాటు కల్పించాలని సంకల్పించారు. దీనివల్ల మౌలిక వసతులు పెరగనున్నాయి. దీనివల్ల వ్యాపారాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ఫలితంగా భూములు, స్థలాలకు డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నారు. దాంతో వాణిజ్య సముదాయాల వద్ద పెంపు దల చేసేలా రిజిస్ట్రేషన్ శాఖ వ్యూహం రచించింది.

నిర్మాణాల్లో కదలిక

వైసీపీ ప్రభుత్వంలో నిలచిపోయిన నిర్మాణ ప్రాజెక్ట్‌లకు ఇప్పుడు మోక్షం లభించింది. నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. భీమవరం, తాడేపల్లిగూడెంలో వాణిజ్య సముదాయాలను నిర్మిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణానికి రియల్టర్‌లు, బిల్డర్లు ముందుకొస్తున్నారు. ప్లాన్‌లు పెట్టుకుంటున్నారు. అభివృద్ధి కోసం భూ యజమానులను సంప్రదిస్తున్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో హైదారాబాద్ వెళ్లిపోయిన బిల్డర్‌లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మళ్లీ ఇప్పుడు జిల్లా వైపు తొంగిచూస్తున్నారు. ఇవన్నీ ఇక్కడ అభివృద్ధికి సూచకంగా అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా రిజిస్ట్రేషన్ శాఖ సైతం భూముల విలువ పెంచే ప్రయత్నం చేస్తోంది. అయితే కొన్ని ప్రాంతలకే పెంపు ప్రతిపాదనలను పరిమితం చేయనున్నారు. అంతిమంగా ప్రభుత్వ ఆమోదించాల్సి ఉంటుంది. అప్పుడే రిజిస్ట్రేషన్ భూముల విలువ పెరగనుంది,

ఎవరా...
నలుగురు..?

» బ్లీచింగ్, స్టేషనరీ, కరెంట్ సామగ్రి మేమే సప్లయ్ చేస్తాం
» మీరు వేరేచోట కొనవద్దు.. » సర్పంచ్‌లకు హుకుం జారీ
» ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ వస్తుందంటూ సమాచారం
» నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారిన నలుగురి దందా



నరసాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓ నియోజకవర్గంలో మూడు రోజుల నుంచి నలుగురి దందా హాట్ టాపిక్‌గా మారింది. ఖరీదైన కారులో వచ్చి పంచాయతీల సర్పంచ్‌ల్ని కలిసి వారి వ్యాపార లక్ష్యాన్ని తెలియజేస్తున్నారు. ఇప్పటి వరకు మీరు బ్లీచింగ్, సున్నం, స్టేషనరీ, కరెంట్ సామగ్రి, లైట్లు వంటివి ఎవరి దగ్గర కొంటున్నారో... మాకు అనవసరం, ఇక నుంచి మేమే సప్లై చేస్తాం, వచ్చే నెల నుంచి మీ ఇండెంట్ మాకు ఇవ్వండి, దీనికి సంబంధించి మీకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ వస్తుందంటూ తెలియజేస్తున్నారు. దీంతో సర్పంచ్‌లు అవాక్కై ఏ సమాధానం చెప్పాలో తెలియక డైలమాలో పడుతున్నారు. కొందరు సీనియర్ సర్పంచ్‌లైతే ఏడాది మధ్యలో సప్లై మార్చడం కుదరదని తేల్చి చెబుతుంటే వీరు మాత్రం కుదరదని ఖరాకండిగా చెప్పేస్తున్నారు. అయితే ఈ నలుగురు గురించి ముందుగా తెలుసుకున్న కొందరు సర్పంచ్‌లు రాగానే మేము ఏమి చూడటం లేదు, అంతా కార్యదర్శి చూస్తారంటూ దాటవేస్తున్నారు. సోమవారం ఆ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పర్యటించి సర్పంచ్‌ల్ని కలిశారు. అందుబాటులోని సర్పంచ్‌లకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేస్తున్నారు. దీంతో ఈ నలుగురు దందా నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది. కొంత మంది సర్పంచ్‌లు సమావేశమై దీనిపై చర్చించుకోవడం కూడా మొదలుపెట్టరు. ఇన్నేళ్ల రాజకీయంలో ఇలాంటి సీన్‌లు చూడలేదని, ముక్కున వేలేసుకుంటున్నారు. అయితే ఇంత వరకు ఏ సర్పంచ్‌కి కూడా ఈనలుగురు చెప్పినట్లు కార్యాలయం నుంచి ఫోన్ రాలేదు. దీంతో వీరు నిజంగా ఎమ్మెల్యేకి చెప్పి వచ్చారా.... లేక ఆయన పేరు వాడుకుని వ్యాపారం చేస్తున్నారా అన్నది రాజకీయంగా చర్చనీయాంశమైంది. సాధారణంగా పంచాయతీల్లో ఏడాది కొకసారి సామగ్రిని కొనుగోలు చేస్తుంటారు. దీనికి ప్రభుత్వం ఒక గైడ్‌లెన్స్ జారీ చేసింది. దాని ప్రకారం లోకల్‌గా నోటిఫికేషన్ ఇస్తారు, లేదా కొన్ని పంచాయతీల్లో నోటీస్ బోర్డుల్లో పెడతారు. దానికి అనుగుణంగా టీబీసీ అనుమతి ఉన్న సప్లయర్స్ ఏడాదికి అవసరమైన సామగ్రినంతా పంచాయతీకి అందిస్తారు, జనరల్ ఫండ్ లేదా ఆర్థిక సంఘం నిధుల నుంచి బిల్లులు క్లియర్ చేస్తారు. ఏడాది మధ్యలో టెండర్ మార్చడం ఉండదు. అయితే ఇక్కడ నిబంధనను పక్కనబెట్టి సప్లై కాంట్రాక్టు తమకు ఇవ్వాలని ఆ నలుగురు హుకుం జారీ చేయడం గమనార్హం.

అదుగో చిరుత!



ఎం.నాగులపల్లి శివారు అందాలమ్మ చెరువు ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

● ట్రాప్ కెమెరాకు చిక్కింది..

ద్వారకాతిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎం.నాగులపల్లి శివారులో రెండురోజుల క్రితం కన్పించి ప్రజలను బెంబేలెత్తించిన చిరుత.. ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాకు చిక్కింది. అది ఆ పరిసర ప్రాంతాల్లోనే మకాం వేసినట్టు అనుమానిస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం ఉదయం ట్రాప్ కెమెరాలో చిరుత సంచారం నమోదు కావడంతో దానిని పట్టుకునేందుకు ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే చిరుత సంచా రాన్ని ఖరారు చేసేందుకు ఆ ప్రాంతంలో దొరికిన దాని పాదముద్రలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగించి నమూనాలను తయారు చేశారు. వీటిని ల్యాబ్‌లో పరిశీలిం చేందుకు అటవీ శాఖ రేంజర్ రాజమండ్రి కి పంపారు. ఈ క్రమంలోనే ట్రాప్ కెమెరాకు చిరుత సంచారం జాడ కన్పిం చడంతో అప్రమత్తమైన జిల్లా అటవీ శాఖ అధికారి ఆశాకిరణ్ సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రాప్ కెమెరాలకు అదనంగా మరో రెండు కెమేరాలను చిరుత జాడ కన్పించిన అందాలమ్మ చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు.

తుఫాన్ అప్రమత్తం

ఆస్తి, ప్రాణ నష్టాలు లేకుండా చూడాలి.. తుఫాన్ షెల్టర్లు సిద్ధం చేయాలి
మండలాల వారీగా యాక్షన్‌ప్లాన్ రూపొందించాలి
అధికారులకు కలెక్టర్ ఆదేశం

భీమవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మండలాల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించి సిద్ధంగా ఉండాలని, రైతులను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. తుఫాన్ హెచ్చరిక కారణంగా ఈనెల 24, 25 తేదీలలో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వీటిని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యం తడవకుండా భద్రపరుచుకునేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలను రైతులకు వ్యవసాయ అధికారులు తెలియజెప్పాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకూడదని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో మండల అధికారులంతా ఒక బృందంగా ఏర్పడి పరస్పర సమన్వయంతో పనిచేసి తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాలను ముందే గుర్తించి, అవసరమైతే ప్రజలను తరలించాలన్నారు. అన్ని వసతులతో పునరావాస శిబిరాలను సిద్ధం చేయాలని అన్నారు. వంతెనలు, కాజ్‌వేల వద్ద కాపలా ఉంచాలని చెప్పారు. ఆర్‌డివోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించడంతో పాటు, ఎప్పటికప్పుడు పరిస్థితిని జిల్లా కేంద్రానికి తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. చెరువుగట్లను బలోపేతంగా చేయాలని సూచించారు.

ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

» 1 నుంచి ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలు
» ఆదేశాలు జారీచేసిన కలెక్టర్ నాగరాణి
» అనర్థాలపై మునిసిపాలిటీల్లో ప్రచారం



భీమవరం టౌన్, అక్టోబరు 21 : ప్లాస్టిక్ భూతంపై మళ్లీ జిల్లాస్థాయి అధికారులు యుద్ధం మొదలు పెట్టారు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాసిక్ నిషేధం అమలుకు శ్రీకారం చుడుతున్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి అమలు చెయ్యాలని ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్లు, పారిశుధ్య, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ నాగరాణి నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు. ముందుగా షాపుల యజమానులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. దీనిపై మునిసిపల్ అధికారులు ప్రచారంతో అవగాహన చేపడుతున్నారు.

చెత్తలో ప్లాస్టిక్ కవర్లే ఎక్కువ

మునిసిపాలిటీల్లో వస్తున్న చెత్తలో చాలా వరకు ప్లాస్టిక్ కవర్లు వస్తువులే ఉంటున్నాయి. దీంతో డంపింగ్‌యార్డుల్లో ఎక్కడ చూసినా ఈ కవర్లే దర్శనం ఇస్తున్నాయి. దీంతో అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి కవర్ల నిషేధానికి చర్యలు తీసుకుంటున్నారు.

వన్ యూజ్ ప్లాస్టిక్‌తో అనర్థం

వన్‌యూజ్ ప్లాస్టిక్ కవర్ల వల్ల ఎక్కువ నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. ఇది భూమిలో కరగటానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని పేర్కొంటున్నారు కవర్లు కాల్చినా దాని ద్వారా వచ్చే వాయువుల వల్ల కూడా రోగాలు వచ్చే ప్రమాదం ఉంది.

షాప్ టూ షాప్ ప్రచారం

భీమవరంలో మునిసిపల్ పారిశుధ్య విభాగం అధికారులు, సచివాలయ ఉద్యోగులు ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. పారిశుధ్య విభాగం డివిజన్‌లవారీగా షాపులకు వెళ్ళి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, వచ్చేనెల 1నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నందున ఎవరైనా వినియోగిస్తే కఠిన చర్యలతో పాటు జరిమానాలు విధిస్తామని యజమానులకు చెప్పటంతోపాటు నోటీసులు అందిస్తున్నారు.

సరఫరా కేంద్రాలపై దృష్టి

నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు మార్కెట్‌లోకి రాకుండా ఉండేందుకు సరఫరాపై మునిసిపల్ అధికారులు దృష్టిపెడుతున్నారు. మార్కెట్‌లోకి రాకుండా అరికడితే నిషేధం అమలు చెయ్యటానికి వీలు ఉంటుందని భావిస్తున్నారు. గతంలో ఎటువంటి చర్యలు తీసుకున్నారో వాటిని అమలుకు చూస్తున్నారు. అదే విధంగా హోల్‌సేల్ వ్యాపారులకు నోటీసులు ఇచ్చే పనిలో ఉన్నారు.

తీరంలో వర్షం



నరసాపురంలో..

నరసాపురం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఉరుములకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అల్పపీడన ప్రభావంతో తెల్లవారు జాము నుంచి వాతావరణంలో మార్పు చోటుకున్నది. ఉదయం నుంచి తేలికపాటి వర్షం పడింది. మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని మార్కెట్ రోడ్డు, స్టీమర్, భూపతివారి వీధి, బ్యాంకు స్ట్రీట్‌లలో మోకాలు లోతు నీరు నిలిచిపోయంది. అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఇటు మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

పాలకొల్లు అర్బన్: పట్టణంలో ఆకాశం కారు మబ్బులతో చిమ్మచీకటిగా మారింది. ఉదయం, మధ్యాహ్నం వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రెయినేజీల్లో నీరు పొంగి రోడ్లపైకి చేరడంతో రోడ్లు బురదగా మారాయి. పట్టణంలోని లాకుల వద్ద నుంచి పూలపల్లి సెంటర్ వరకు రోడ్డు పూర్తిగా పాడైపోయి గోతుల మయంగా మారింది.

పోడూరులో 68.2 మి.మీ. వర్షపాతం

భీమవరం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం ఉదయం 8-30 ప్రాంతం నుంచి సోమవారం ఉదయం 8-30 వరకు నమోదైన వర్షపాతం ఇలా ఉన్నది. అత్యధికంగా పోడూరులో 68.2 మిల్లీమీటర్లు, ఆచంట 10, భీమవరం 1.2, వీరవాసరం 8.2, కాళ్ళ 5.2, మొగల్తూరు 12.4, నరసాపురం 5, పాలకొల్లు 9.8, తాడేపల్లిగూడెం 5.8, అత్తిలి 2.8, గణపవరం 3.4 ,పెనుమంట్ర 3, పాలకోడేరు 4.4వర్షపాతం నమోదైంది. పెంటపాడు, తణుకు,ఆకివీడు, ఉండి, పెనుగొండ, యలమంచిలిలో వర్షపాతం నమోదు కాలేదు.

సొసైటీలకు త్రిసభ్య కమిటీలు

ప్రభుత్వం కీలక నిర్ణయం
నామినేటెడ్ ఆశావహులకు అవకాశం



పెంటపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలలో త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికలు నిర్వహించేంత వరకు కమిటీలే సహకార సంఘాలకు ప్రాతినిధ్యం వహించనున్నాయి. వైసీపీ హయాంలో సహకార సంఘాలకు ఐదేళ్ల పాటు ఎన్నికలు నిర్వహించలేదు. సొంత నాయకులకు, కార్యకర్తలకు అవకాశం కల్పించారు. త్రిసభ్య కమిటీలను వేసి కాలయాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో రంగంలో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధమవుతోంది. తాజాగా సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించనుంది. ఎన్నికలు నిర్వహించేదాకా మాత్రమే కమిటీలు ఉంటాయని ఇటీవల తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులకు సహకార రంగంలో ప్రాతినిధ్యం ఉంటుందని ఆశిస్తున్నారు. అయితే కాలయాపన లేకుండా త్రిసభ్య కమిటీలను వేయాలని కోరుకుంటున్నాయి. జిల్లాలో 125 సహకార సంఘాలున్నాయి. ఇన్‌చార్జి అధికారుల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. దీనివల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోంది. రైతులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. కమిటీలు ఉంటే రుణాలు తీసుకోవడానికి ఎగబడుతుంటారు. ప్రస్తుతం అధికారుల వద్దకు రైతులు వెళ్లలేకపోతున్నారు. దాంతో కొత్త రుణాలు అంతంత మాత్రంగానే మంజూరవుతున్నాయి. అదే త్రిసభ్య కమిటీలు ఉన్నట్టయితే నేరుగా రైతులు సంప్రదిస్తారు. లక్ష్యాలను చేరుకుని, సొసైటీ వ్యాపారాన్ని విస్తరించడానికి కమిటీలు పనిచేస్తాయి. ఆమోదముద్ర వేస్తాయి. ప్రస్తుతం ఆడిట్ చేసే అధికారులు ఇన్‌చార్జిలుగా ఉన్నారు దాంతో అన్నింటికీ కొర్రీలు పెడతారంటూ సిబ్బంది ముందడుగు వేయడంలేదు. కూటమి ప్రభుత్వం కమిటీలు వేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు కమిటీలే సహకార సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి.



అమ్మను గెలిపించాడు..

భర్త చిన్నప్పుడే పట్టించుకోకుండా వదిలేశాడు.. అయినా ఆమె తన బిడ్డ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసింది ..టైలరింగ్ చేస్తూ ఉన్నత చదువులు చదివించింది. ఆకివీడుకు చెందిన బొంతాడ లక్ష్మీ భర్త తన కుమారుడు ఏడాది వయసు ఉన్నప్పుడే వదిలి వెళ్ళిపోయాడు. రాత్రి పగలు కష్టపడి టైలరింగ్ చేస్తూ తన బిడ్డ జీవన్‌కుమార్‌ను ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకూ ప్రైవేటు కాన్వెంటులో చదివించింది. ఖర్చయినా ఆరవ తరగతి కార్పొరేట్ కళాశాలో జాయిన్ చేసింది. తన తల్లి నమ్మకాన్ని జీవన్ వమ్ము చేయలేదు. నీట్‌లో 675 మార్కులు సాధించాడు. ఇప్పుడు కాకినాడ రంగరాయ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కొడుకు చదువుకోసం ఆ తల్లి పడుతున్న కష్టం తెలిసి లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిలుకూరి కృష్ణంరాజు జీవన్‌ను దత్తత తీసుకున్నారు. ఏడాదికి రూ.85 వేలు ఖర్చు అవుతుందని చదువు పూర్తయ్యేవరకు ఖర్చు తానే పెట్టుకుంటానని ముందుకు వచ్చారు. మరికొంతమంది లయన్స్ సభ్యులు కూడా సాయం చేసేందుకు ముందుకు వచ్చారు.

- ఆకివీడు



హరహరా అంటే కోనేరులో నీటి బుడగలు

కలిదిండిలో ప్రాచీన ఆలయం

కలిదిండిలో అతి ప్రాచీన దేవాలయం పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయాన్ని రాజరాజ చోళుడు కుమారుడు రాజరాజ నరేంద్రుని కాలంలో ఒక రైతు నాగలితో పొలం దున్నుతుండగా నాగలి కర్రు తగిలి నెత్తురు వరదలై బయట పడ్డ స్వయంభూ లింగంగా స్థల పురాణం చెబుతోంది.



స్వయంభూ లింగం బయట పడిన చోటే ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ఆవరణంలో పంచబుగ్గల కోనేరు ఉంది. కోనేరు చెంతకు భక్తులు వెళ్లి హరహర అంటే బుడ బుడ మంటూ ఐదు బుగ్గలు రావటాన్ని నేటికీ ప్రత్యేకంగా వీక్షించవచ్చు. దక్షిణ కాశీగా పేరొందిన కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారు.

-కలిదిండి



పార్టీ సభ్యత్వం తీసుకోండి !

జూనియర్ చంద్రబాబుగా పిలవబడే ఆచంట చినపేటకు చెందిన ఆంద్రు లక్ష్మణరావు గత కొన్ని సంవత్సరాలుగా టీడీపీ కార్యకర్తగా పనిచేస్తూ అప్పుడప్పుడూ చంద్రబాబునాయుడులా వేషం కడుతుంటారు. దగ్గరలో ఎక్కడైనా చంద్రబాబు నాయుడు మీటింగ్‌లు జరిగినపుడల్లా తన సైకిల్‌కు టీడీపీ జెండాలు కట్టి అందరిని ఆకర్షించేలా వేషాలు వేస్తూ ఆకట్టుకుంటాడు.బర్త్‌డే వేడుకల్లో స్టేజిమీదకు వచ్చి చంద్రబాబు నాయుడులా మిమిక్రీ చేస్తుంటారు. ఈ నెల 26 నుంచి జరగబోయే పార్టీ సభ్యత్వ నమోదు అందరూ తీసుకోవాలని కోరుతూ ఆచంటలో ఇలా ప్రచారం చేస్తున్నారు.

- ఆచంట

ధాం..ధాం



దిగని బాణసంచా ధరలు

గతేడాదితో పోలిస్తే స్వల్పంగా పెరుగుదల

వాతావరణంపైనే వ్యాపారుల ఆశలు

నరసాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి పండుగకు ఒక ప్రత్యేకత ఉంది. కుల మతాలకు అతీతంగా చాలామంది ఈ పండుగ జరుపుకుంటున్నారు. చిన్న పెద్ద, వృద్ధులతో సహా ఏదో ఒక టపాసులు కాల్చి ఆనంద పడుతుంటారు. ఇక పిల్లలైతే ఈ పండుగ ఎప్పు డొస్తుందని ఎదురు చూస్తుంటారు. చేతిలో డబ్బులు లేకపోయినా... అప్పుతెచ్చి టపాసులు కొంటారు. ఈ పండుగ ఇంత ప్రత్యేకత ఉన్నందునే బాణ సంచా వ్యాపారం కూడా భారీగానే సాగుతోంది. ఏటా పెరుగుతూ వస్తుందే తప్ప తగ్గడం లేదు. అమ్మకాలు జరిగేది రెండు రోజులు అయినప్పటికీ కోట్లల్లోనే ఉంటుంది. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు రెగ్యులర్ లెసెన్స్ వ్యాపారులు కాకుండా తాత్కాలిక లెసెన్స్‌లు పొంది దుకాణాలు పెట్టే వ్యాపారుల సంఖ్య కూడా ఎక్కువే. పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా వాతావరణం అనుకూలిస్తే అన్నిచోట్ల ఫుల్‌గా వ్యాపారం సాగుతుంది. అధికారుల అంచనా ప్రకారం ఉమ్మడి జిల్లాలో రూ.20 నుంచి రూ.25 కోట్లుపైనే ఈ వ్యాపారం ఉంటుందని అంచనా. అత్యధికంగా భీమవరంలో సాగుతుంది. తరువాత స్థానంలో టీపీగూడెం, తణుకు, పాలకొల్లు, నర సాపురం నిలుస్తాయి. ఇక మండలాల్లో ఆకివీడు, ఉండి, పెనుగొండ, ఆచంట ప్రాంతాల్లో కూడా ఎక్కువగానే ఉంటుంది. జిల్లాలో లెసెన్స్ వ్యాపా రులు అత్యధికంగా తణుకు, టీపీగూడెం, భీమవరం, పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల్లో ఉన్నారు.

వాతావరణంపైనే ఆశలు

గత రెండేళ్ల నుంచి వ్యాపారం కలిసి రాలేదు. అల్పపీడనం కారణంగా వర్షాలు కురిశాయి. దీపావళి రోజున తెరిపి ఇవ్వడంతో కొద్దిగా వ్యాపారం జరిగింది. తాత్కాలిక వ్యాపారులంతా నష్టపోయారు. అయితే ఈసారి ప్రకృతి కలిసి వస్తుందన్న ఆశతో ఉన్నారు. దానికి అనుగుణం గానే తాత్కాలిక లెసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ఈనెల 25 వరకు గడువు ఉంది. అత్యధికంగా పట్టణ ప్రాంతాల్లోనే దుకాణాలు వేసేందుకు మక్కువ చూపుతున్నారు. సబ్ కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల్లో ఈ తాత్కాలిక లెసెన్స్‌లు జారీ చేస్తున్నారు.



జీఎస్టీ, కెమికల్స్ ధరలు తగ్గినా..

అయితే జీఎస్టీ, కెమికల్స్ ధరలు తగ్గినా ధరలు మాత్రం దిగలేదు. గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. అవి కూడా కొన్ని రకాలే. మరికొన్ని రకాల్లో మార్పు లేదు. గతంలో పోలిస్తే డీజిల్ ధర తగ్గింది. ఈ కారణంగా రవాణ ఛార్జీలు తగ్గినా ధరలు మాత్రం దిగిరాలేదు. గతంలో దీపావళి సామాగ్రిపై 23 శాతం జీఎస్టీ ఉండేది, నేడు అది 18 శాతానికి దిగింది. ఇటు తయారీకి వాడే కెమికల్స్ ధరలు కూడా తగ్గాయి. ఈ కారణంగా ఈ ఏడాది టపాసుల ధరలు భారీగా తగ్గుతాయని భావించారు. కానీ అనుకున్న స్థాయిలో ధరలు దిగిరాలేదు. దీంతో రూ.1000 పట్టుకుంటే సంచి కూడా నిండని పరిస్థితే ఉంది. ఇక ధరల విషయానికి వస్తే.. కాకరపువ్వొత్తులు సాదా ధర రూ.75 ఉంది. ఇదే రకం పువ్వులు అయితే రూ.90 నుంచి రూ.100 వరకు ఉంది. భూచక్రాల బాక్స్ రకాన్ని బట్టి రూ.100 నుంచి రూ 150 మధ్య ఉంది. చిచ్చి బుడ్డుల రకాన్ని బట్టి ధరలు ఉన్నాయి. చిన్నవి బాక్స్ రూ.60 నుంచి 80, పెద్దవి రూ.70 నుంచి రూ.100 పలుకుతోంది. చిన్నారులు ఇష్టంగా కాల్చే పెన్సిల్స్ ధరలు కూడా రూ.50కి చేరింది. 1000 వాలా బాక్స్ రూ.300, అదే 5000 వాలా అయితే రూ.1200 పలుకుతోంది. ఇక మిగిలిన టపాసులు ధరలు కూడా గత ఏడాదితో పోలిస్తే కొద్దిగా పెరిగాయి.

భయపెడుతున్న వర్షాలు



గత ఏడాదితో పోలిస్తే టపాసులు ధరలు పెద్దగా పెరగలేదు. కొన్ని రకాలు మాత్రమే స్వల్పంగా పెరిగాయి. మరికొన్ని ఆలాగే ఉన్నాయి. కెమికల్స్ , రవాణా ఛార్జీలు తగ్గడం వల్ల కొద్దిగా దిగి వచ్చాయి. శివకాశీలో కూడా పెద్దగా అమ్మకాలు లేవు. తయారీ కూడా తగ్గింది. ఈ ప్రభావం వల్ల ధరలు పెద్దగా పెరగలేదు. ఏటా పది నుంచి 20 శాతం పెరుగుతాయి. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. గత రెండేళ్ల వర్షాల కారణంగా వ్యాపారులు నష్టపోయారు. దీనికి తగ్గట్టు ఈ సంవత్సరం ఎన్నడూ లేని విధంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో వ్యాపారుల్లో భయం నెలకొంది. గతంలో మాదిరిగా పెద్ద ఎత్తున స్టాక్‌లు కొనడం లేదు.

-యర్రంశెట్టి మోహనరావు, వ్యాపారి

సమ్‌థింగ్ స్పెషల్

4 am బిర్యానీ

తెల్లవారుజాము నాలుగు గంటలకే రెడీ..

క్యూ కడుతున్న యువత



బిర్యాని అంటే ఇష్టపడని వారు ఉండరు. బిర్యానీ ఎక్కువగా మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో తింటారు.. కానీ తెల్లవారు జాము నాలుగు గంటలకు కూడా బిర్యాని తింటారంటే కొద్దిగా ఆలోచించాల్సి విషయమే.. కానీ ఇది నిజమే ? ఎక్కడో తెలుసుకోవాలని ఉందా ? అంటే మీరు భీమవరం వెళ్లాల్సిందే.. భీమవరం మెంటేవారి తోట బైపాస్ రోడ్డులో ఉదయం 4 గంటలకు 4 ఏఎం బిర్యానీ పేరుతో బిర్యాని అందిస్తున్నారు. తెల్లవారు జామున ఎవరు తింటారులే అనుకుంటే మనం పప్పులో కాలు వేసినట్టే.. ఇక్కడి బిర్యానీ కోసం జిల్లాలోని తాడేపల్లిగూడెం, నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, ఉండి వంటి ప్రాంతాల నుంచి యువత తెల్లవారు జామున వచ్చి బిర్యానీ టేస్టును ఆస్వాదిస్తున్నారు. మహానగరాలు అయిన హైదరాబాదు, బెంగళూరు వంటి ప్రాంతాలకే పరిమితమైన ఈ బిర్యానీని భీమవరంలో మొట్టమొదటి సారిగా ఈట్ అండ్ బెస్ట్ రెస్టారెంట్ వారు ప్రారంభించారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి ఉదయం 6 గంటల వరుకు బిర్యానీ లభిస్తుంది. ప్లేట్ బిర్యాని రూ.149 ఇస్తున్నారు. చిట్టిముత్యాల రైస్‌తో బిర్యాని తయారు చేసి ఉలవచారు, గోంగూరతో సర్వ్ చేస్తారు. ఉదయం వేళ కాబట్టి మసాలాలు, నూనెలు తక్కువ మోతాదులో వాడుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఇడ్లీ తిన్నంత ఈజీగా ఈ బిర్యానీ కూడా అరిగిపోతుందని చెబుతున్నారు.



- భీమవరం అర్బన్

యువత అభిరుచికి అనుగుణంగా..



నేటి యువతకు ఉన్న అభిరుచికి అనుగుణంగా ఈ బిర్యాని ప్రారంభించాం. నేను మర్చంట్ నేవీలో సెకండ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. బిర్యానీలో ఉపయోగించే పదార్థాల నాణ్యతలో ఎక్కడా రాజీ పడటం లేదు. యువత ఎక్కువగా ఈ బిర్యాని తినేందుకు వస్తున్నారు. డైజేషన్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా వంటకాల్లో పదార్థాలు ఉపయోగిస్తున్నాం. బిర్యాని రూ.149 చార్జి చేసున్నాం.

-ఎం.శ్యామ్, యజమాని



రోడ్లు ఇలా ఉంటే పడిపోరా !

రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాహసమే..ఎప్పుడు ఎక్కడ ఏ గోతులో పడిపోతామో తెలియని విధంగా రహదారులు తయారయ్యాయి. పెనుమంట్ర మండలం పాలమూరు శివారు నవుడూరు సెంటర్ సమీపంలో వీరవాసరం-బ్రాహ్మణ చెరువు రహదారిపై రోడ్డంతా పెద్ద పెద్ద గోతులతో మడుగులా తయారైంది. ప్రతిరోజు పదుల సంఖ్యలో వాహన దారులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. సోమవారం బైక్‌పై వెళుతున్న వారు ఇదిగో ఇలా గోతిలో పడిపోయారు. పాలమూరు గ్రామానికి చెందిన జన సైనికులు గోతిలో నీటిని శ్రమ దానం చేసి బయటకు తోడారు. జేసీబీ సాయంతో కంకర వేసి గోతులు పూడ్చారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వర్షాలు తగ్గితే తప్ప గోతులు పూడ్చలేమని తేల్చి చెప్పారు. జన సైనికులు చేసిన పనిని పలువురు అభినందిస్తున్నారు.


కంకరతో గోతులు పూడ్చిస్తున్న జనసైనికులు

- పెనుమంట్ర


ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టరు నాగరాణి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు సేవలందించాలి : కలెక్టర్

ఉండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు మేలైన సేవలందించాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం ఉండి మండలం ఎస్ఆర్‌పి అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంగాలు ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సును ఆమె ప్రారంభించారు. ఈ సంఘాలు కేవలం రైతులను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసినవేనని అన్నారు. జిల్లాలో 76 పరపతి సంఘాలకు సంబంధించిన ప్రతినిధులకు కృషి విజ్ఞాన కేంద్రాల సహకారంతో 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని అనంతరం వారికి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఉండి కృషిజ్ఞాన కేంద్రంలో 30 ప్రతినిధులకు, వెంకటారామన్నగుడెంలో 20, ఎన్టీఆర్ జిల్లా గరికిపాడులో నలుగురు, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఆరుగురు, గుంటూరులో 16 మందికి శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు ఎం.నాగరాజు, కె.వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మల్లిఖార్జునరావు, కోఆపరేటివ్, కృషి విజ్ఞాన కేంద్రాల, వ్యవసాయ శాఖల సిబ్బంది శిక్షణ పొందే ప్రాథమిక వ్యవసాయ శాఖ ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌లో 125 అధ్యాపక పోస్టులు

3,300 దరఖాస్తులు

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో 125 అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నారు. నిట్‌లోని 8 ఇంజనీరింగ్ కోర్సులలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల కోసం 3300 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రాయపూర్ నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావును కేంద్రం నియమించింది. ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అధ్యాపక పోస్టులు భర్తీ అయితే వచ్చే విద్యాసంవత్సరంలో 750 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నారు. ఏపీనిట్‌లో బోధన సిబ్బంది కొరత కారణంగా గడిచిన ఏడాది నుంచి సీట్ల సంఖ్యను కుదించారు. ఈ ఏడాది కూడా 480 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. అధ్యాపక పోస్టులు భర్తీ అయ్యాక బోధన సిబ్బంది కొరత తీరనుంది. ఇటీవల 19 మంది ప్రొఫెసర్లను భర్తీ చేశారు.

ప్రోబ్లమ్ జోన్


వేండ్రలో రహదారి పక్కనే చెత్తను డంపింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బాబోయ్..కంపు భరించలేం !

చెత్త ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలంటూ లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి అవి నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. పాలకోడేరు మండలం వేంద్ర పంచాయతీ ఇందుకు ఉదాహరణగా కనిపిస్తున్నది. గ్రామంలోని చెత్తనంతా తీసుకొచ్చి పాలకోడేరు నుంచి వేంద్ర వెళ్ళే ఆర్అండ్‌బీ రహదారి పక్కనే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఇక్కడ వేస్తున్న చెత్త తినేందుకు పందులు, కుక్కలు అక్కడకు చేరుతున్నాయి. ఆ వ్యర్థాల దుర్వాసనతో అటుగా వెళ్లే ప్రయాణికులు ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. అసలే వర్షాకాలం.. రోగాలు చుట్టుముడుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై గ్రామస్థులు విమర్శిస్తున్నారు. వేంద్ర పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ అధికారులు స్పందించి రహదారి వెంబడి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- పాలకోడేరు

మహనీయుల స్ఫూర్తి

వాడవల్లి కీర్తి















స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగ ధనులుగా ప్రజల హృదయాల్లో నిలిచిన మహనీయులను ఆ గ్రామం గుండెల్లో పెట్టుకుంది. వారి విగ్రహాలను గ్రామంలో ఏర్పాటు చేసి యువకుల్లో పోరాటస్ఫూర్తిని నింపారు. ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామంలో పలువురు పోరాట యోధుల విగ్రహాలను గ్రామస్థులు ఏర్పాటు చేశారు. 70 సంవత్సరాల క్రితమే గ్రామ ప్రముఖుడు కాశీనాథుని కుమారేశ్వరరావు సంకల్పంతో గ్రామస్థులు పలువురు చొరవ తీసుకుని విరాళాలు సేకరించి మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాలను ఏర్పాటు చేశారు. నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలతో పాటు, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే రోజున గ్రామస్థులు ఐక్యతా ప్రదర్శన నిర్వహించి వారికి నివాళులర్పిస్తుంటారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మహనీయుల విగ్రహాలను తొలిసారిగా ఒకే రోజున ఏర్పాటు చేసిన ఘనత వాడవల్లి గ్రామానికి దక్కిందని చెప్పవచ్చు.

-ముదినేపల్లి

వాడవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు వల్లభాయి పటేల్, టంగుటూరి ప్రకాశం పంతులు జవహర్ లాల్ నెహ్రూ , సుభాష్ చంద్రబోస్ ,మహాత్మాగాంధీ విగ్రహాలు

శ్రీవారి ఆదాయం రూ.3.03 కోట్లు



ద్వారకాతిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపు ద్వారా గడచిన 33 రోజుల కాలానికి శ్రీవారికి రూ.3.03 కోట్ల నగదు, 597 గ్రాముల బంగారం, 8.244 కేజీల వెండి వచ్చినట్లు ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. స్థానిక ప్రమోద కల్యాణ మండప ఆవరణలో సోమవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (45), రూ. రెండు వేలు(39)తో పాటు విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించారన్నారు.

వైద్య సేవలపై అలసత్వంవహిస్తే చర్యలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్య సేవలందించడంలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆరోగ్య శాఖ జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్ హెచ్చరించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో ఇటీవల పురిటి నెప్పులతో ఇబ్బంది పడ్డ గర్భిణీ కథనంపై సోమవారం ఆయన ఏరియా ఆస్పతి ని ఆకస్మికంగా సందర్శించారు. వివిధ విభాగాలలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది రోగులతో వ్యవహరిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రత్యేక విద్యా కోర్సుకు నోటిఫికేషన్ జారీ

ఏలూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ రెండేళ్లకుగాను బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక విద్యాకోర్సు 2024-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు కోసం నోటిఫి కేషన్ జారీ చేసిందని, పరివర్తన్, బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ఓసీలకు 50, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌వారికి 40 శాతం మార్కుల ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులన్నారు. కోర్సు పూర్తి అయిన వారికి ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ, ఎస్ఎస్ఏలో, ఐఈఆర్టీ, రీసోర్స్ టీచర్లుగా సీబీఎస్ఈ, ఈ స్కూల్స్ ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల్లో ఉపాధి పొందవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారానికి 99486 00642 నెంబర్లో సంప్రదించాలన్నారు.

జడ్పీలో జగడమేనా?

- మళ్లీ అత్యవసర సమావేశానికి పట్టుపట్టిన వైసీపీ
- ఏలూరులో సమావేశమైన 30 మంది జడ్పీటీసీలు
- నెలలో ఇది రెండోసారి డిమాండ్
- అత్యవసరమా.. అదిలింపా
- వెనకుండి నడిపిస్తున్న నేతలెవరు?
- చైర్‌పర్సన్ పద్మశ్రీ అనుకూలురుల్లో మాత్రం ధీమా



ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్‌లో రోజురోజుకు రంగులు మారుతున్నాయి. ఇంతకుముందు వైసీపీ పక్షానికి చెందిన ఘంటా పద్మశ్రీ జడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఆమె ఇటీవలే వైసీపీకి రాజీనామా చేసి తన భర్తతో సహా టీడీపీలో చేరారు. దీంతో జిల్లా పరిషత్‌లో అత్యధిక బలం కలిగిన వైసీపీ కాస్తా ఖంగుతింది. కాని తమకున్న బలంతో ఎట్టి పరిస్థితుల్లోను కొన్ని తీర్మానాలను అడ్డుకోవాలని, ఇంకొన్నింటిని ముందుకు సాగకుండా చూడాలని, తద్వారా తమ పార్టీ ఉనికిని జడ్పీలో కాపాడుకునేందుకు వైసీపీ తరచూ ఎత్తుగడలు వేస్తూనే ఉంది. ఇప్పటికే జిల్లా పరిషత్‌కు సంబంధించి అత్యవసర సమావేశాన్ని నిర్వహించాల్సిందిగా వైసీపీ అనుకూల జడ్పీటీసీలందరూ గట్టిగా పట్టుపడుతున్నారు. పక్షం రోజులకు ముందే ఒకసారి అత్యవసర సమావేశానికి పట్టుపట్టారు. తిరిగి మరోసారి వైసీపీ అనుకూల జడ్పీటీసీలంతా సోమవారం జిల్లా పరిషత్ అతిథి గృహంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.



ఏలూరు జడ్పీ అతిథి గృహం వద్ద వైసీపీ జడ్పీటీసీలు

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లా పరిషత్‌లో మొదటి నుంచి వైసీపీదే ఆధిపత్యం. జడ్పీలో మొత్తం జడ్పీటీసీల సంఖ్య 48 కాగా దీనిలో 46 వైసీపీ అనుకూలురుదే. వీరవాసరం, ఆచంట జడ్పీటీసీలు మాత్రం కూటమి పక్షంలో ఉన్నాయి. ఇంత అత్యధిక బలం కలిగిన జడ్పీలో అనూహ్యంగా చైర్‌పర్సన్ నేరుగా టీడీపీలో చేరారు. ఆ తరువాత మరికొంతమంది జడ్పీటీసీలు టీడీపీలో చేరతారని అందరూ భావించారు. ఆ ప్రక్రియ మాత్రం ఇప్పటిదాకా పూర్తికాలేదు. దీనికి తోడు వైసీపీ పెద్దలు మాత్రం జడ్పీలో తమకున్న బలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాగూ నాలుగేళ్ళు దాటనిదే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అవకాశం లేదన్న భావనతో ఏదోక రకంగా తమ పార్టీ ఉనికి ఉండేలా జాగ్రత్తపడడం ఆరంభించారు. జడ్పీటీసీ సభ్యులను పార్టీని వీడకుండా ఇప్పటికే కొంతమంది పూర్తిగా అనునయించారు. ఎందుకనంటే చైర్‌పర్సన్ ఒక్కసారిగా పార్టీ మారడంతో జడ్పీలో అత్యధిక సభ్యులు కూడా ఇదే బాట పడతారని అందరూ ఊహించారు. తీర ప్రాంతానికి చెందిన జడ్పీటీసీలు కొందరు నేరుగా జనసేనలోకైనా వెళ్తామే తప్ప టీడీపీ వైపు రాబోమన్న నిర్ణయానికి వచ్చారు. ఇలాంటి తర్జనభర్జనలు జడ్పీటీసీ సభ్యుల మధ్య తరచూ చోటు చేసుకుంటున్నాయి. స్థానికంగా ఎమ్మెల్యేలంతా కూటమి పక్షానికి చెందిన వారు కావడం, తాము మాత్రం మండల స్థాయిలో జడ్పీటీసీ సభ్యులుగా వైసీపీలో ఉండి ఏమాత్రం ప్రయోజనమని భావిస్తున్న మరికొందరు మాత్రం టీడీపీవైపు తొంగి చూడడానికి ప్రయత్నిస్తూనే వచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తాము ఎదురుతిరిగి ఏమీ చేయలేమని, సర్దుకుపోవడమే తప్ప అనే భావనలో ఇంకొందరు ఉన్నారు. ఇలా రకరకాలుగా ఎవరం తటవారుగా జడ్పీటిసిలు తమ మనోభావాలను పూర్తిగా బయట పెట్టలేక, అలాగని నేరుగా మౌనం దాల్చి ఉండలేక సతమతమవుతూనే ఉన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి మా త్రం టీడీపీ కైవసం అయినా జడ్పీటిసి సభ్యుల్లో మాత్రం ఇంకా ఊగిసలాట కొనసాగుతూనే ఉంది.

ఎందుకు అత్యవసర సమావేశం ?

జడ్పీలో అత్యవసర సమావేశం నిర్వహించాలని కొందరు జడ్పీటీసీలు గట్టిగా పట్టుపట్టడానికి వెనుక బలమైన కారణాలు ఉన్నాయా ? వైసీపీలో కొందరు పెద్దల ఆదేశం మేరకే ఈ రకంగా బల ప్రదర్శనకు సిద్ధమవుతున్నారా ? లేకుం టే జిల్లా పరిషత్ తమ ఆధీనంలో ఉందన్న సంకేతాలు బలంగా బయటకు వెళ్ళేలా కొత్త ఎత్తుగడ వేశారా అనే సందేహాలే ఇప్పుడు అందరిలోనూ ఉన్నాయి. వాస్తవానికి జిల్లా పరిషత్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పెద్దగా నిధులు లేవు. జగన్ ప్రభుత్వ హయాంలో జడ్పీలకు ఎక్కడా ఆర్థిక ఊతమివ్వలేదు. ఆఖరుకి జనరల్ ఫండ్ విషయంలోను ఎప్పుడూ దోబూచులాటే. ఒకానొక దశలో జిల్లా పరిషత్‌లు తమ సభ్యులందరికీ జనరల్ ఫండ్ కింద కొన్ని నిధులు కేటాయించి వారి ఆధ్వర్యంలోనే ఆయా మండలాల్లో పనులు సాగేలా చూడడం సమాంతరంగా జడ్పీటీసీలకు కూడా స్థానికంగా ప్రతిష్ట ఉండేలా జాగ్రత్తపడిన సందర్భాలు ఉన్నాయి. కాని వైసీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం ఇవేవీ అప్పటి ప్రభుత్వానికి పట్టలేదు. జిల్లా పరిషత్‌లు దాదాపు నీరసించాయి. కొత్త పనులు చేపట్టలేక ఏదో తూతూ మంత్రంగా వ్యవహారం నడిపేవి. ఇప్పుడు పంచాయతీరాజ్ విభాగంలో మంత్రి పవన్‌కళ్యాణ్ వినూత్న చర్యలకు దిగుతుండడం, ఆయా పనులకు దగ్గరుండి పర్యవేక్షణ, నిధుల కేటాయిస్తుండడంతో కొంతమేర నూతన ఉత్తేజం కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో జడ్పీలో అత్యవసర సమావేశం నిర్వహణకు వీలుగా వైసీపీ ఎజెండా ఏమిటనేదే అందరి ప్రశ్న. జడ్పీ అతిథి గృహంలో సోమవారం జడ్పీటీసీల సమావేశం నిర్వహణకు వైసీపీలో ఒక సీనియర్ నేత దగ్గరుండి నడిపించారని చెబుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైసీపీ నాయకత్వం బలహీనపడినా ఇంకోవైపు జిల్లా పరిషత్ సభ్యులను మాత్రం నేరుగా డైరెక్ట్ చేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త ఘంటా ప్రసాదరావు మాత్రం ఇప్పటికీ ధీమాతో ఉన్నారు. కేవలం అలజడి సృష్టించడానికా, లేక తమకు కొత్త అవకాశాలు రావడానికా, జడ్పీటీసీల దూకుడనేది త్వరలో తేలబోతుందని ఇంకొందరు విశ్లేషిస్తున్నారు. అత్యవసర సమావేశాన్ని కోరుతూ దాదాపు 30 మంది జడ్పీటీసీలు సంతకాలు చేయడం మరొక అంశంగా భావిస్తున్నారు. ఇప్పటిదాకా అత్యధికులు వైసీపీని వీడి టీడీపీ, జనసేనలోకి వస్తారని అందరూ లెక్కకట్టారు. కాని తాజా పరిణామాల ప్రకారం వైసీపీ అనుకూల జడ్పీటిసిలు ఉమ్మడిగా ఒకవైపే ఉండబో తున్నారా లేక అత్యవసర సమావేశమంటూ ఒక ఝలక్ ఇచ్చి తదుపరి నిర్ణయాల వైపు తొంగి చూస్తున్నారా అనేది కూడా చాలా మందిలో ఓ అభిప్రాయం ఉంది. అలా కాకుండా వైసీపీకి అనుకూలంగానే కడదాకా ఉండాలని వీరంతా భావిస్తే ఉమ్మడి పశ్చిమ జడ్పీలో మాత్రం భవిష్యత్తులో ఒకింత కుదుపే కాబోతుంది.

రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించండి : మహేశ్



కేంద్ర పెట్రోలియం కార్యదర్శితో ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రానికి ప్రత్యేకంగా సీఎస్ఆర్ నిధులు విడుదల చేసి ఆదుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, కేంద్ర పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్‌కు విన్నవించారు. ఢిల్లీలో పంకజ్ జైన్ కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంధనం, సహజ వాయువు శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరానన్నారు. ఎంపీ విజ్ఞప్తికి పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వాసవిలో వర్క్ షాపు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక అంశాలపై పట్టు సాధించే వర్క్ షాపులను సద్వినియోగం చేసుకోవాలని నిట్ వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్ కేవీ కాదంబరి పేర్కొన్నారు. పెదతాడేపల్లి గూడెంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం డిజైన్ చాలెంజర్స్ ఇన్ ఎయిమ్ బెస్ట్ అంటేనాక్ 5జీ డిమాండ్ కమ్యునికేషన్ కియరి 2 ప్రాక్టీస్ మిషన్ లెర్నింగ్ 5 రోజుల వర్క్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ నిట్ ఎలక్ట్రానిక్ విభాగాధిపతి యువరాజ్ విద్యార్థులకు సాంకేతికతలో మెళకవలు వివరించారు. కళాశాల పాలక వర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ రత్నాకర్ రావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ రూపకల్పనకు శ్రీకారం

ఏలూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ నిధులతో ముద్రించనున్న 'విజయకేతనం' స్టడీ మెటీరియల్ రూపకల్పన ప్రక్రియకు వర్క్ షాపును సోమవారం జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రారంభించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల సంస్థ (డీసీఈబీ) ఆధ్వర్యంలో ఆయా సబ్జెక్టు నుంచి ఎంపిక చేసిన 40 మంది ఉపాధ్యాయ నిపుణులతో కూడిన బృందంతో జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడు తూ స్టడీ మెటీరియల్ గతేడాదికంటే మరింత క్వాలిటీగా ఉండేలా రూపొందించాలని సూచించారు. అనంతరం డీఈవో కార్యాలయంలో వర్క్ షాపును జిల్లా విద్యాశాఖాదికారి అబ్రహం ప్రారంభించి, పలు సూచనలు చేశారు. డీసీఈబీ కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, కార్యాలయ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పురుగు మందుల వల్లే అనర్థాలు

శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు

పెనుమంట్ర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విచక్షణా రహితంగా పురుగు మందుల వినియోగంతో సాగు ఖర్చులు పెరగడమే కాకుండా రైతులకు క్యాన్సర్, దృష్టి దోషాలు, చర్మ వ్యాధులు, వంటి సమస్యలు కూడా వస్తున్నాయని ప్లాంట్స్ ప్రొడక్షన్ జాయింట్ డైరెక్టర్ ఎ.సిద్ధిఖి అన్నారు. మార్టేరులోని ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో గోదావరి మండలాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులకు సమగ్ర సస్యరక్షణ చర్యలపై ఐదు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఏడీఆర్ డాక్టర్ డి.శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. డాక్టర్ సిద్ధిఖి మాట్లాడుతూ పురుగు మందులకు ప్రత్యామ్నాయాలైన వృక్ష సంబధిత కషాయాలు, జీవ నియంత్రకాల వాడకం వంటి వాటిపై కూడా అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పురుగులు, తెగుళ్ల, ఎలుకల కారణంగా సుమారు 30 శాతం పంట రైతులు కోల్పోతున్నారన్నారు. ఈ నష్టాన్ని తగ్గించుకోవడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులు అవలంబించేలా వారిని సమయాత్తం చేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. ప్రకృతి వ్యవసాయంపై కూడా అవగాహన కలిగించాలని జిల్లా వ్యవసాయధికారి జెడ్.వెంకటేశ్వరావు సూచించారు. మనోజ్ పురి గోస్వామి, డిప్యూటీ డైరెక్టర్, కె.వీరయ్య చౌదరి, ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, డాక్టర్ టి.ప్రేమరంజితం, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు సురేష్, ఎ.ఉదయ్‌శంకర్, ఎంవీ కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏడీఆర్ శ్రీనివాస్

కబళించిన మృత్యువు

- బస్సు ఢీకొని దంపతుల మృతి
- శుభకార్యానికి వెళుతుండగా ఘటన



మృతులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, దుర్గ, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

నిడదవోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మరో ఐదు నిమిషాల్లో గమ్యస్థానానికి చేరేలోగానే బస్సు రూపంలో ఆ దంపతులను మృత్యువు కబళించింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన భార్యాభర్తలు బెల్లంకొండ వెంకటేశ్వరరావు (63), దుర్గ (50) కొవ్వూరు మండలం మద్దూరులోని ఉంటున్న వెంకటేశ్వరరావు సోదరుడి మనుమడి పురిటి స్నానం ఉయ్యాల కార్యక్రమానికి సోమవారం యాక్టీవాపై బయలుదేరారు. వీరిని నిడదవోలు మండలం గోపవరం వద్ద రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వస్తున్న నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వారిని ఢీకొట్టింది. దీంతో దంపతులు ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ఐదు నిముషాల్లో శుభకార్యం జరిగే ఇంటికి చేరుకునే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమిశ్రగూడెం ఎస్ఐ కె.వీరబాబు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న బంధువులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణం వద్ద కన్నీటి సంద్రంగా మారిపోయింది. బంధువుల రోదనలు మిన్నంటాయి. వెంకటేశ్వరావు దంపతుల స్వగ్రామం విజ్జేశ్వరం కాగా కూలి పనుల నిమిత్తం తణుకు మండలం పైడిపర్రులో నివాసముంటున్నారు.

పైడిపర్రులో విషాదఛాయలు

తణుకు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పైడిపర్రులోని నాగేంద్రనగర్‌లో నివాసముంటున్న దంపతులు బెల్లంకొండ వెంకటేశ్వరావు, దుర్గ మృతి చెందారనే విషయంలో తెలియడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. వెంకటేశ్వరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దుర్గ సైతం భర్తకు తోడుగా స్థానికంగా ఉన్న పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి కుమారుడు పద్మారావు, కుమార్తె లక్ష్మీ ఉన్నారు. ఇరువురికి వివాహాలయ్యాయి. మృతులు ఇంటివద్దకు పెద్ద ఎత్తున స్థానికులు చేరుకుని జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నారు.

హత్యాయత్న కేసుల్లో..

11 మందికి మూడేళ్ల జైలు

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొలం తగాదాలో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడినట్లు ఇరువైపులా నమోదైన రెండు కేసుల్లో నేరం రుజువు కావడంతో మొత్తం 11 మందికి ఒకొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాస మూర్తి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురంనకు చెందిన పేనేటి రంగనాయకమ్మ కుటుంబానికి, యలమర్తి భూపతియ్య కుటుంబాల మధ్య రెండేకరాల వ్యవసాయ భూమి (నిమ్మతోట)లో తగాదాలు ఉన్నాయి. 2011 మే 4వ తేదీ ఉదయం యలమర్తి భూపతయ్య కోడలు పద్మాకు రెండేకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో మామిడి చెట్లు కాయలు కోయడానికి వెళ్లగా పేనేటి రంగనాయకమ్మ, యలమర్తి భాస్కర్ చౌదరి, యలమర్తి దుర్గాదేవి, యలమర్తి గాంధీ, దేవినేనివారిగూడానికి చెందిన పాకలపాటి సుబ్రహ్మణ్యం కత్తులతో దాడి చేసి గాయపరిచారు. భూపతయ్య ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ద్వారకాతిరుమల ఎస్ఐ ఎన్.పోతురాజు ఆ నిందితులపై హత్యాయత్న కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. నిందితులు ఐదుగురిపై నేరం రుజువు కావడంతో ఒకొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు.

ఇదే గొడవలో అదే గ్రామానికి చెందిన పేనేటి రంగనాయకమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై ద్వారకా తిరుమల పోలీసులు అదే గ్రామానికి చెందిన యలమర్తి భూపతయ్య, యలమర్తి కాంతా రత్నం, యలమర్తి శ్రీనివాసరావు, యలమర్తి లక్ష్మణరావు, యలమర్తి భాస్కరసురేష్, దెందులూరు మండలం పెరుగ్గూడానికి చెందిన నల్లూరి శివనాగుపై అప్పటి ద్వారకాతిరుమల ఎస్ఐ పోతురాజు హత్యాయత్న కేసు నమోదు చేశారు. ఈ కేసు కూడా ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది.

ఈ ఆరుగురు నిందితులపై కూడా నేరం రుజువు కావడంతో ఒకొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ లక్ష్మణ్ నాయక్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, కోర్టు కానిస్టేబుల్ సంసుద్దీన్, ద్వారకాతిరుమల కానిస్టేబుల్ మురళీ, ఎస్ఐ సుధీర్‌బాబు సహకరించారు.

క్రైమ్ కార్నర్

భర్త తాగుతున్నాడని..

మొగల్తూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిస అయిన భర్తను చూసి మనస్థాపానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకున్న వైనమిది. మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన లక్కవరపు అనూష (25) ఆమె భర్త మాణిక్యాలరావు మద్యానికి బానిసగా మారి ఆర్థిక ఇబ్బందులకు కారణమవు తున్నాడు. ముగ్గురు పిల్లలు ఉన్న అనూష భర్త తీరు మారకపోవడంతో తన ఇంట్లోనే ఈ నెల 19న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాయచూట్‌లో ఉన్న మృతురాలి తల్లి తివారి అంజలి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధలు భరించలేక..

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక ఒక యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని శాంతినగర్ 14వ రోడ్డులో నివాసముంటున్న పిల్లా దుర్గాప్రసాద్ (22) హోటల్‌లో పని చేస్తున్నాడు. అధికంగా అప్పులు ఉన్నాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి యధావిధిగా నిద్రించాడు. తెల్లవారేటప్పటికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని సోదరి పిల్లా రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధు వులకు అప్పగించారు.

మృతదేహం లభ్యం

పెదవేగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : కవ్వగుంటలో ఈతకువెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతైన బెజవాడ ప్రసాద్(40) మృతదేహం సోమవారం లభించింది. కవ్వగుంట గ్రామానికి చెందిన బెజవాడ ప్రసాద్ గ్రామానికి సమీపంలోని పోలవరం కుడి కాలువలో ఆదివారం సాయంత్రం దిగి, ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

వాగులో గల్లంతైన యువకుడు మృతి

మోతుగూడెం/ఉంగుటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని సోకులేరు వాగులో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభించింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన కరణం రవితేజ (22) పది మంది స్నేహితులతో కలిసి ఈ నెల 18న సోకులేరు వచ్చా డు. వాగులో స్నానాలు చేస్తుండగా రవితేజ కనిపిం చలేదు. దీనిపై వారు మోతుగూడెం పోలీసులకు సమాచారం అందించారు. ఆతడి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలించగా రవితేజ మునిగిపోయిన కిలో మీటరు దూరంలో అతడు విగత జీవిగా కనిపి ంచాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మోతు గూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమవరం రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

భీమవరం క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న మహిళను అరెస్టు చేసి రూ.లక్ష పది వేలు విలువ గల 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే జీఆర్పీ ఎస్ఐ పీటీవీ రమణ తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో దీపావళి సందర్భంగా టపాసులు, బాంబులు వంటివి రవాణా అరికట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం టౌన్ రైల్వే స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా ఒక మహిళ పోలీసును చూపి పారిపోతుండగా పట్టుకున్నారు. ఆమె వద్ద ఉన్న బ్యాగులు తనిఖీలు చేయగా 22 కేజీల గంజాయి పొట్లాలు ఉన్నాయి. విశాఖ జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తుందని విచారణలో తేలినట్లుగా ఎస్ఐ తెలిపారు. ఆమెను రాజమహేంద్రవరం లక్ష్మీవరపుపేటకు చెందిన జెర్రిపోతుల రమణమ్మగా గుర్తించారు.

పల్టీలు కొట్టిన కారు.. నలుగురికి గాయాలు

చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ని నూరంపాలెం వద్ద, విజయవాడ-సత్తుపల్లి రహదారిలో ఆదివారం రాత్రి కారు పల్టీలు కొట్టి మళ్ళీ నిలబడటంతో నలుగురు గాయపడ్డారు. లింగపాలెం మండలం యర్రంపల్లికి చెందిన గోలి వెంకటేశ్వరరెడ్డి భార్యా, కు టుంబ సభ్యులతో కలిసి కారులో సత్తుపల్లి వెళ్లి తిరిగివస్తుండగా కారు అదుపుతప్పి పల్టీలు కొట్టి మళ్లీ నిలబడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా ఒకరు సుక్షితంగా బయటపడ్డారు. గాయపడినవారిని 108లో విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బంగారు ఆభరాణాల చోరీ

భీమవరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి ఇంటికి వస్తున్న మహిళ బ్యాగ్ చోరీకి గురైంది. వన్ టౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం పట్టణానికి చెందిన కాలా నాగ ఉమామహేశ్వరి అట్లతద్ది సందర్భంగా వీరవాసరం తన పుట్టింటికి వెళ్లి ఈ నెల 20న భీమవరం బస్సులో వచ్చారు. అయితే బస్ డిపో వద్దకు వచ్చేసరికి తన వద్ద ఉన్న బ్యాగు ఉంది. ఇంటికి వెళ్ళి చూసేసరికి బ్యాగ్ కనిపించలేదు. ఆ బ్యాగ్‌లో 28 కాసుల బంగారు అభరాణలు చోరీకి గురైనట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్

పెంటపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఉన్న సామాను మొత్తం కాలి బూడిదైన ఘటన సోమవారం మండలంలోని పరిమెళ్ళ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని గొర్రెల అప్పారావుకు చెందిన రెండు పోర్షన్ల డాబాలో భలే కిషోర్ అనే వ్యక్తి కుటుంబంతో సహా నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం సుమారు 10 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. ఘటనలో భలే కిషోర్‌కు చెందిన సుమారు రూ.నాలుగు లక్షల విలువ చేసే సామగ్రి కాలిపోయినట్లు తాడేపల్లిగూడెం ఫైర్ అధికారి రామారావు తెలిపారు.

గుండెపోటుతో సైనికుడి మృతి




ఆర్మీ జవాన్‌కు నివాళులర్పిస్తున్న ఆర్డీవో అద్దయ్య, సైనికులు (ఇన్‌సెట్‌లో) మృతుడు ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

కొయ్యలగూడెం, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ బాధ్యతలకు వెళ్తున్న సైనికుడు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జరిగింది. కొయ్యలగూడెం పట్టణానికి చెందిన రావిపాటి ప్రవీణ్‌కుమార్ (40) గ్రామానికి వచ్చి తిరిగి రాజస్థాన్‌కు విధుల్లో చేరడానికి వెళ్తుండగా విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందాడు. దీంతో ఆర్మీ సుబేదర్ కిరణ్‌కుమార్ రాజస్థాన్ నుంచి విశాఖపట్నం చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని కొయ్యలగూడెం తీసుకువచ్చారు. మృతుడు హవల్దార్‌గా ఆర్మీలో పని చేస్తున్నారు. ప్రవీణ్ కుమార్‌కు భార్య కుమార్తే ఉన్నారు. ప్రవీణ్ కుమార్ భౌతిక కాయానికి ఆర్డీవో అద్దయ్య, ఆర్మీ అధికారులు సుబేదర్, కిరణ్‌కుమార్, లక్ష్మీకాంత్, జిల్లా కేంద్రమైన ఏలూరుకు చెందిన ఎన్‌సీసీ అధికారులు, సర్పంచ్ విజయకుమారి, తహసీల్దార్ తెల్లన్నదొర, మాజీ సైనికులు నివాళులర్పించారు. ప్రవీణ్‌కుమార్‌కు అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

18 ఏళ్లకే నూరేళ్లు నిండాయా..

పద్దెనిమిదేళ్లకే నూరేళ్లు నిండాయా నాన్నా.. మేము ఏం పాపం చేశామని మాకీ కడుపుకోత.. దేవుడు ఎందుకింత అన్యాయం చేశాడంటూ ఆ తల్లి విలపిస్తూంటే అక్కడున్న వారికి సైతం కన్నీళ్లు ఆగలేదు. చిరుప్రాయంలోనే కుమారుడిని కోల్పోయిన ఆ తల్లి గుండెకోత ఎవరు తీర్చలేరంటూ బంధువులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు.



కవులూరు చరణ్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం గ్రామ శివారులో ఉన్న ఒక సామిల్లులో పనిచేస్తున్న కవులూరు చరణ్ (18)అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతి చెందాడు. సామిల్లులో పనిచేసే కార్మికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం సామిల్లులో కర్ర కోత మిషన్ పైన ఒక దుంగ పెట్టి మృతుడు చరణ్‌తో పాటు శివ,అజయ్ కోస్తుండగా యంత్రానికి ఒక్కసారిగా విద్యుత్ సరఫరా వచ్చింది. దీంతో చరణ్‌కు, శివకు షాక్ కొట్టడంతో శివ వెనక్కి పడిపోయాడు. అతనికి స్వల్ప గాయాలయ్యాయి. కానీ చరణ్ మాత్రం మిషన్‌ను పట్టుకుని అలాగే ఉండి పోయాడు. వెంటనే మెయిన్ ఆఫ్ చేసి చరణ్‌ను విడిపించి ఆటోలో జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆ తర్వాత స్థానిక ఏరియా ఆస్పత్రికి పోస్టు మార్టమ్ నిమిత్తం తరలించారు. మృతుడు చరణ్ కొంతకాలం క్రితమే సామిల్లులో పనికి చేరాడు. అంతకుముందు తాపీ పనులకు వెళ్లేవాడని బంధువులు తెలిపారు. తమ కుమారుడి మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని కుమారుని మృతదేహం వద్ద బోరున విలపించారు. గ్రామస్తులకు, బంధువులు సైతం కంటనీరు పెట్టుకున్నారు. చిం తలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మృతుడి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సామిల్లు యజమాని ఈ ఘటనపై స్పందించలేదని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆస్పత్రి మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలువురు టీడీపీ నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్కవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని.. వ్యక్తికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మండలంలోని కప్పలకుంట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కలపర్రు టోల్ ప్లాజా ఇన్‌చార్జ్ ప్రశాంత్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏలూరు వైపు వెళ్తున్న ఓ లోడు లారీ కప్పలకుంట రహదారిపై నిలిచి ఉంది. ఇదే సమయంలో బైక్ పై వెళ్తున్న ప్రశాంత్ ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. దీంతో అతనికి తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా ఉంది. ఇతడ్ని వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తరచూ రోడ్డు పక్కన వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

దరఖాస్తు గడువు పొడిగింపు

భీమవరం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణకు చర్యలు చేపట్టామని, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె. శోభారాణి తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించామని, ఆసక్తి గల విద్యార్థులు వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

అత్తిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ అత్తిలి, భీమవరం విష్ణు దంతవైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అత్తిలి లయన్స్ క్లబ్ భవనంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ డీసీ యాతం రాంబాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉచిత దంత పరీక్షలు, చికిత్స, పళ్లను శుభ్రపర్చడం, పుచ్చు పళ్ళ తొలగింపు, సిమెంట్ ఫిల్లింగ్, దంత సంబంధ సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు.

వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

భీమవరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహిస్తున్నామని, పోలీసులు-వారి త్యాగాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల అనే అంశంపై పోటీలు జరుగుతాయని నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి తెలిపారు. ఆసక్తి గలవారు సంస్కార్ స్కూల్ 9912322209, సీవీ రామన్ స్కూల్ 9640088449లను సంప్రదించాలని, ఈ నెల 30న విజేతలకు బహుమతులిస్తామని తెలిపారు.

బాణసంచాతో జాగ్రత్త

భీమవరం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళికి బాణసంచా కాల్చే టప్పుడు జాగ్రత్తలు పాటించాలని భీమవరం ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు అన్నారు. భీమవరం ఫైర్ స్టేషన్ ఆవరణలో శ్రీ విజ్ఞాన వేదిక బాణసంచా కాల్పుల జాగ్రత్తలపై అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దీపావళి రోజున బకెట్‌లో ఇసుక, నీళ్ళు, పాత గోనె సంచి, పాతబట్టలు దగ్గర ఉంచుకోవాలని, ముఖానికి దగ్గర బాణసంచా కాల్చవద్దని అన్నారు. పులపర్తి శ్రీనివాస్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రొఫెసర్ రవిస్వరూప్‌కు డాక్టరేట్

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ చిగురుపాటి రవిస్వరూప్‌కు తమిళనాడు అన్నామలై వర్సిటీ ఐటీ విభాగం నుంచి పీహెచ్‌డీ పట్టా లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. సోమవారం యాజమాన్యం తరపున కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ డాక్టర్ స్వరూప్‌ను సత్కరించారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, డీన్ అకాడమిక్స్ డా.వి చంద్రశేఖర్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ డా. రామకృష్ణమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

మానవత బేబి కిట్స్ వితరణ

ఆచంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆచంట మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బాలింతలు దేవాబత్తుల హిమజ, మార్లపూడి సుగుణ బాలింతలకు బేబీ కిట్‌లను, ఔషధాలు, పండ్లు అందజేశారు. మానవత మండల శాఖ అధ్యక్షుడు కుక్కల లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాస్ అభిమానుల రక్తదానం

మొగల్తూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఆయన అభిమాన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మొగల్తూరులో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 25 మంది రక్తదానం చేశారు. రక్తదాతలను మాజీ సర్పంచ్ మామిడిశెట్టి సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ కలిదిండి కుమార్ బాబు, జిల్లా అభిమాన సంఘాల అధ్యక్షుడు చింతపల్లి రవి కుమార్, సోషల్ వర్కర్ టి. రామకృష్ణ తదితరులు సర్టిఫికెట్‌లు అందించారు.



నానాజీకి ఘన నివాళులు

పెనుగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడు తరాల శాసనసభ్యులు జవ్వాది లక్ష్మయ్యనాయుడు, జవ్వాది శ్రీ రంగ నాయకులు, కూనపరెడ్డి వీర రాఘవేంద్రరావు(చినబాబు) వంశాంకురం లక్ష్మయ్య నాయుడు (నానాజీ) మృతితో పెనుగొండ శోక సంద్రమైంది. అనారోగ్యంతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందిన నానాజీ మృతదేహాన్ని సోమవారం ఉదయం పెనుగొండకు తీసుకురాగా జిల్లా నలుమూలల నుంచి నాయకులు, అభిమానులు భారీగా తరలి రావడంతో పెనుగొండ జవ్వాది వారి వీధి కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద్‌రాజు, మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, చిర్ల జగ్గిరెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరాటం రాంబాబు, ఆకుల బాబు, ముక్కామల పీఠాధిపతి శ్రీధర్ స్వామీజీ, సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్‌పీటీసీలు పోడూరి గోవర్ధన రామయ్య, ఘనంగా నివాళులు అర్పించారు.

సమస్యలు సత్వరం పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ సూచన



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు సర్వీస్ డెలివరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మొత్తం 179 అర్జీలు అందాయి. వీటిలో కొన్ని.. తన వ్యవసాయ భూమి జాయింట్ ఎల్‌పి నెంబర్ నుంచి వేరు చేయాలని ఇరగవరం మండలం కంతేరుకు చెందిన వెలగల జయరామిరెడ్డి, ఇంటి స్థలం సరిహద్దు దారి సమస్యను పరిష్కరించాలని పెనుమంత్ర మండలం మామిడూరుకు చెందిన ఎం.ఎస్. నారాయణ స్వామి, ఫిర్యాదులో పేర్కొన్నారు. వితంతు పెన్షన్ మంజూరు చేయాలని గణపవరం మండలం వెంకట్రాజపురానికి చెందిన సిద్ధాబత్తుల మిస్సమ్మ అర్జీ ఇచ్చారు. ఇల్లు మంజూరు చేయాలని తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన భారతి దివ్యశ్రీ దుర్గ కోరారు. తన తండ్రి ఎక్స్ సర్వీస్ మెన్ కాగా ప్రభుత్వం కలవపూడిలో ఐదెకరాల భూమిని మంజూరు చేసిందని, దానిని సాగు చేసుకుంటున్నానని, పట్టా ఇప్పించాలని కాళ్ల మండలం బోస్ కాలనీకి చెందిన బందెల లాజరు అర్జీ ఇచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ జె.ఉదయ భాస్కరరావు, సచివాలయం అధికారి దోసిరెడ్డి, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

● **భీమవరం క్రైం:** 17 సంవత్సరాలుగా ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు నిరసన తెలిపి కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు చవ్వాకుల గోవింద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లూరి గాచయ్య తదితరులు పాల్గొన్నారు.

● **ఆకివీడు:** మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 8 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.

● **తాడేపల్లిగూడెం రూరల్:** అర్జీలు వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సునీల్‌కుమార్ అన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు. ఎంపీడీవో విశ్వనాథ్, ఎంఈవో హనుమ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై నివేదిక ఇవ్వండి: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం: నిర్దేశించిన సమయంలో చట్టపరిధిలో అర్జీలు పరిష్కరించాలని, ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించారు. సమస్యలపై మొత్తం 13 అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని, తీసుకున్న చర్యల నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పుల్లారావు తదితర అధికారులు పాల్గొన్నారు.



భీమవరంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యేలు పులపర్తి, కనుమూరి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన





గణపవరంలో కళాశాల విద్యార్థుల మానవహారం.. మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో నివాళులు

మీ త్యాగాలు మరువలేం

పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో పలువురి నివాళి

మొగల్తూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలకు తెగించి మీరు చూపిన త్యాగం, ధైర్యం ఎప్పటికీ మరువలేమని సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్ఐ జి.వాసు, ఏఎస్ఐ రాజేందర్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు

గణపవరం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో అశువులబాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎప్పటికి మరువలేనివని గణపవరం ఎస్సై మణికుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గణపవరంలో సోమవారం ప్రభుత్వ, డిగ్రీ కాలేజీల విద్యార్థులు, పోలీసులు శాంతి ర్యాలీ నిర్వహించారు. గణపవరం సెంటర్‌లో మానవహారం ఏర్పడి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచంట: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విద్యార్థులతో కలిసి ఎస్ఐ కట్టా వెంకట రమణ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరులకు ఎస్ఐ, సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు.



పేరుపాలెం సౌత్‌లో రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే నాయకర్ శంకుస్థాపన



పల్లూరుపల్లి పల్లెపండుగలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయం

మొగల్తూరు/నరసాపురం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. సోమవారం పాతపాడు, జగన్నాథపురం, కాళీపట్నం పడమర, కొత్తోట, పేరుపాలెం సౌత్, రామన్నపాలెం గ్రామాల్లో రూ.1 కోటి 45 లక్షలు ఉపాధి నిధులతో నిర్మించే పలు రహదారి నిర్మాణాలకు ఆయన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అదే గ్రామాల్లో ఇటీవల నిర్మించిన పలు రహదారులను ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ పాలనలో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని గాలికి వదిలేసిందన్నారు. సర్పంచ్‌లు కొప్పాడ లక్ష్మీ తులసీ, కవురు సావిత్రి, జ్యోతిప్రసాదరాజు, పడవల సత్యనారాయణ, తిరుమాని విజయలక్ష్మీ, ఎలీషా, మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, జనసేన అధ్యక్షుడు కొల్లాటి గోపి, తహసీల్దార్ రాజ్ కిషోర్, ఎంపీడీవో త్రిశూల పాణి, డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల అధికారులు మర్యాదగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నాయకర్ సూచించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పెండింగ్ సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మండలంలోని సీతారాంపురం నార్త్, కె. బేతపూడి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్లు రాజరాజేశ్వరి, రాజా కిషోర్, ఎంపీడీవోలు రామకృష్ణంరాజు, త్రిశూలపాణి, ఎస్సైలు సురేష్, జి.వాసు డీటీ సుగుణ సంధ్య పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం : బొలిశెట్టి

పెంటపాడు: వైసీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం వల్లూరుపల్లి, పరిమెళ్ళ గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగ, రీసర్వే రెవెన్యూ గ్రామ సభలలో ఆయన పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు దంగేటి రామారావు, గొర్రెల కోటేశ్వరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల కతీతంగా అందరూ కలసి మెలసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎంపీపీ హైమవతి, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, సర్వేయర్ రౌతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు చిత్తశుద్ధితో అమలు

ఇరగవరం: రేలంగిలో పల్లెపండుగను కూటమి నాయకులు నిర్వహించారు. రూ. 22 లక్షల వ్యయంతో డ్రైయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన, రూ. 2.30 లక్షలతో మినీ గోకులం నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని, మేనిఫెస్టోలో హామీలన్నీ నెరవేర్చ డానికే ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని టీడీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు చుక్కా సాయిబాబు అన్నారు. నాయకులు మానే భాస్కర రావు, పసుపులేటి అబ్బులు, సర్పంచ్ స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి వచ్చిన వారిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

భీమవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతా రామలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు భీమవరం మండలం నరసింహ పురం ఉప సర్పంచ్ ఇందుకూరి ఆంజనేయ రాజు, భీమవరం పట్టణం 1 వార్డు నుంచి కడలి సుబ్రహ్మణ్యం (బాలు) వారి అనుచరులు 150 మందితో తెలుగుదేశంపార్టీలో చేరారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు ఏపీఐసీసీ చైర్మన్ మంతెన రామరాజు వైసీపీ నాయకులకు టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమనే నమ్మకంతో జిల్లా వ్యాప్తంగా వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారన్నారు. తోట సీతారామలక్ష్మి మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం హామీల అమలు పట్ల ఆకర్షితులైన వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలోకి రావడం ఆనందదాయకమన్నారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు గూడూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న కవూరు పృథ్విశంకర్ వీరవాసరం మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్ వీరవల్లి శ్రీనివాస్ నరసింహపురం గ్రామ నాయకులు ఇందుకూరి ఆంజనేయరాజు మోకా శాంతినాగరాజు గాదిరాజు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువు డంపింగ్ యార్డుకు కేటాయించవద్దు

తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ చైర్మన్‌కు డిసెంట్

ఆకివీడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మంచినీటి చెరువును డంపింగ్ యార్డుకు కేటాయించవద్దంటూ వైసీపీ, జనసేన కౌన్సిలర్లు చైర్మన్‌కు డిసెంట్ అందజేశారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. పట్టణ పరిధిలోని కొండయ్య మంచినీటి చెరువును డంపింగ్ యార్డుకు కేటాయిస్తున్నామంటూ పాలకమండలి సమావేశం దృష్టికి కమిషనర్ జి.కృష్ణమోహన్ తీసుకెళ్ళారు. 20 వార్డులకు సంబంధించిన వైసీపీకి-13, టీడీపీకి-4, జనసేనకు ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో వైసీపీకి చెందిన ఐదుగురు, జనసేనకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ డిసెంట్‌ను చైర్మన్ జామి హైమవతికి ఇచ్చి మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలో అనేక ఆక్రమణలుండగా వాటిని వదిలేసి మంచి నీటి చెరువును డంపింగ్ యార్డు చేయడం దుర్మార్గమన్నారు.



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలి

భీమవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా ఉచిత బస్సు వాగ్దానం నెరవేర్చలేదని భీమవరం తపాల శాఖ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. మహిళా నాయకురాలు సోడదాసి సిల్వియా ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నామని అన్నారు. భీమవరం నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అంకెం సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు పథకాలు అమలు చేయాలి

తణుకు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం వేల్పూరు గ్రామ టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ అశోక్ వర్మకు వినతిపత్రం అందజేసారు. సంఘ నాయకులు యండమూరి నాగేంద్ర, మల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద పెంపే లక్ష్యం: పత్సమట్ల

గణపవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశుసంపదను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జల్లికొమ్మరలో సోమవారం ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువును రక్షించేందుకు ప్రభుత్వం ఉచిత పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం 150 పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. సర్పంచ్ కురెళ్ళ త్రిమూర్తులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మికం

క్షీరారామంలో అభిషేకాలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 21 : స్థానిక పంచారామ క్షేత్రం క్షీరా రామమంలో సోమవారం సందర్భంగా ప్రత్యేకంగా ఏకవార, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. గోపూజలు చేసుకున్నారు. సాయంత్రం పంచహారతులు ఇచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. 24వ వార్డు శంభన్న అగ్రహారంలోని శంభేశ్వర స్వామివారికి, కోడిగట్టున ఉన్న శంకర మఠంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరునికి, అభిషేకాలు పూజలు చేశారు.

ఘనంగా పాశుపతాస్త్ర హోమం

మొగల్తూరు: సుబ్రహ్మణ్యేశ్వరంలో సోమవారం పాశుపతాస్త్రం హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. గుడాల చిట్టిముత్యం-శశిరేఖ, గుడాల సుబ్రహ్మణ్యం-సరస్వతి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అన్నసమారాధన జరిగింది.



మావుళ్ళమ్మకు బంగారం

భీమవరం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన ఆ వీరేంద్ర బాబు దేవి కృష్ణ ప్రభ దంపతులు ఆదిత్య ఆక్వా 18 గ్రాముల 190 మిల్లిల. బంగారం విరాళాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదగా దేవస్థానానికిఅందించారు. ముందుగా దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదన్ని, శేషవస్త్రాన్ని అందించారు దాతలను ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు.

మద్దిరావమ్మకు నడివీధి వేడుక

కాళ్ళ: ప్రతీ మూడేళ్ళకు ఒకసారి కాళ్ళ గ్రామంలో నిర్వహించే మన ఊరి మద్దిరావమ్మ జాతర సందర్భంగా నడివీధికి తీసుకుని వచ్చే వేడుక ఆదివారం రాత్రి నిర్వహించారు. రామాలయం కూడలిలో పూరిగుడిసె ఏర్పాటు చేసి అమ్మవారి ప్రతిమను నిలబెట్టి పూజలు నిర్వహించారు. ఈనెల 24 గురువారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామ పెద్దలు తెలిపారు.

భారీ అన్నసమారాధన

గణపవరం: గ్రామంలోని చినరామచంద్రపురంలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. గణపవరం పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు రద్దీ కారణంగా గణపవరం, క్రొవ్విడి, ఆకువీడు రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కమిటీ సభ్యులు రుద్ర రాజు ఆంజనేయరాజు, వెంకటలక్ష్మి దంపతులు, ఆర్.శివ రామరాజు, అల్లూరి సుధీర్‌కుమార్‌రాజు, రమ్య, కాకర్ల విష్ణుశ్రీనివాసరావు, నాగవెంకట కనకలక్ష్మి పాల్గొన్నారు.

పెంటపాడు: దసరా మహోత్సవాల సందర్భంగా పెంటపాడు కాశీ అన్నపూర్ణాదేవి ఆలయంలో శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని సోమవారం ఘనంగా ఊరేగించారు.

ఆలయం పునఃప్రతిష్ఠకు శంకుస్థాపన

ఉండి: శిథిల ఆలయాల పునః ప్రతిష్ఠ అభినందనీయమని ఎమ్మెల్యే రఘు రామ కృష్ణరాజు అన్నారు. సోమ వారం ఆరేడులో రూ. 1.50 కోట్లతో నిర్మించే పార్వతీ సమేత తాండేశ్వరీస్వామి, కేశవస్వామి వారి ఆలయాలకు శంకుస్థాపన చేశారు. జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీఎం సురక్షా బీమా యోజన సద్వినియోగం చేసుకోండి

భీమవరంటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం మీ కోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ జే ఉదయ భాస్కరరావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏ నాగేంద్ర ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, డ్వామా పీడీ డా. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలం ఆక్రమణ యత్నం

నరసాపురం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుస్తుంబాద శివాలయ భూమిని ఇద్దరు ఆక్రమించేందుకు యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆక్రమణకు పాల్పడిన వారు పనులు చేపడుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న వీహెచ్‌పీ నాయకులు పనుల్ని అడ్డుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న సీఐ యాదగిరి, ఎస్సై ముత్యాలరావు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఇటు వీహెచ్‌పీ నాయకులు ఎక్స్‌కవేటర్‌ను తీసుకొచ్చి ఆలయ స్థలంలో ఏర్పాటు చేసి కంటేనర్‌ను బయటకు తొలగించారు.

సివిల్ సప్లై డీటీగా సత్యనారాయణ

నరసాపురం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నరసాపురం సివిల్ సప్లై ఇన్‌చార్జి డీటీగా అయితం సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎలక్షన్ డీటీగా ఇక్కడ పని చేసిన నాగదేవి సివిల్ సప్లై కూడా చూసే వారు. ఆమె ఇటీవల పోడూరు బదిలీ కావడం తో సత్యనారాయణకు బాధ్యతలు అప్పగించారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆజాద్ హింద్ ఫౌజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జెండా వందనం చేశారు. విద్యార్థులకు చాక్లెట్లు పంచారు.

6 ఆధార్ కేంద్రాల ఏర్పాటు

నరసాపురం రూరల్, అక్టోబరు 21: మండలంలో సరిపల్లి, లక్ష్మణేశ్వరం, ఎల్‌బి చర్ల, లిఖితపూడి, పసలదీవి, సరిపల్లి గ్రామ సచివాలయాల వద్ద ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో రామకృష్ణంరాజు తెలిపారు. ఆధార్‌లో పేర్లు మార్పులు, వేలిముద్రలు సరి చేసుకోవాలని సూచించారు. ఇటు పట్టణంలోని టేలర్‌పేట, కోటవద్దపాలెం, మునిసిపల్ వీధి, చినమామి డిపల్లి సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులు ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ అంజయ్య తెలిపారు.

క్లాప్ డ్రైవర్ల నిరసన

తణుకు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం 26 వేలు అందించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక శాఖ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మిక శాఖాధికారి కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: క్లాప్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగారావు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని 15 రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్న క్లాప్ డ్రైవర్లు ఏఐటీయూసీ అధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యా లయం వద్ద నిరసన తెలిపారు.

అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలి

ఇరగవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలని ఏలేటిపాడు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఇ.రాంబాబు అన్నారు. ఏలేటిపాడు జడ్పీ హైస్కూలులో బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆర్ఎం శ్రీదేవి, విజిలెన్సు అధికారి సత్యనారాయణ, మేనేజర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధిద్దాం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిరోధానికి ఐసీడీఎస్ సిబ్బందితో పాటు అన్ని శాఖల ఉద్యోగులు కలసికట్టుగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు సూచించారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద బాల్య వివాహాల నిరోధంపై మున్సిపల్, ఐసీడీఎస్ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.